

కౌంటింగ్‌లో సమస్యలను ఎస్పీ చందనా దీప్తికి వివరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

*తొలి ప్రాధాన్యతలో తేలని విజేత*

# గెలుపు కోటా 1,55,095 ఓట్లు

- 18,565 ఓట్ల ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న
- 1,04,248 ఓట్లతో రెండో స్థానంలో రాకేశ్‌రెడ్డి
- మొదలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- నేడు వెలువడనున్న తుది ఫలితం
- కౌంటింగ్‌లో ఏకపక్ష ధోరణిపై బీఆర్ఎస్ ఈసీకి ఫిర్యాదు

నల్లగొండ ప్రతినిధి, జూన్6(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ఊహించినట్లుగానే తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలలేదు. బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం గెలుపు కోటాకు దూరంగా నిలిచిపోయారు. దాంతో విజేతను తేల్చేందుకు ఎలిమినేషన్ ప్రక్రియలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం 8గంటలకు మొదలైన కౌంటింగ్‌లో తొలి రోజు సాయంత్రం వరకు కట్టలు కట్టే కార్యక్రమం కొనసాగింది. సాయం త్రం 4గంటల నుంచి మొదలైన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు రెండో రోజు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. మొత్తం నాలుగు రౌండ్లల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కొనసాగగా ఒక్కో రౌండ్ కనీసం ఐదారు గంటల సమయం తీసుకుంది. ఇక ఎలిమినేషన్ రౌండ్ సైతం సుదీర్ఘంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేటి మధ్యాహ్నానికి తుది ఫలితం వెలువడి విజేత తేలనున్నట్లు అంచనా.

### తొలి ప్రాధాన్యతలో తేలని ఫలితం

మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా నాలుగు రౌండ్లల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం నాలుగు హాల్స్‌లో 96టేబుళ్లపై లెక్కింపు కొనసాగింది. కౌంటింగ్‌లో అందరి దృష్టి ప్రధాన అభ్యర్థులుగా భావించిన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్‌పైనే ఉంది. తొలి మూడు రౌండ్‌లలో తీన్మార్ మల్లన్నకు ఆధిక్యం లభించగా చివరి రౌండ్‌లో రాకేశ్ రెడ్డి స్వల్ప ఆధిక్యతను ప్రదర్శించారు. నాలుగు రౌండ్లు ముగిసే సరికి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు, రాకేశ్‌రెడ్డికి 1,04,248 ఓట్లు, ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, అశోక్‌కుమార్‌కు 29,697 ఓట్లు వచ్చాయి. ఇందులో మొత్తంగా తీన్మార్ మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక చెల్లని ఓట్లను వేరు చేసి చెల్లిన ఓట్లను పరిగణలోకి తీసుకుని గెలుపు కోటాను ఫైనల్ చేశారు.



నల్లగొండలో కొనసాగుతున్న కౌంటింగ్

### గెలుపు కోటాకు దూరంగా...

మొత్తం పోలైన ఓట్లల్లో తొలి ప్రాధాన్యత లెక్కింపు పూర్తయ్యాక పరిశీలిస్తే 25,824ఓట్లు చెల్లనివిగా లెక్క తేలాయి. పట్టభద్రులై ఉండి కూడా నిబంధనల ప్రకారం ఓటు వేయడంలో వీరు విఫలం కావడం గమనార్హం. వీటిని తొలగించిన అనంతరం చెల్లిన ఓట్ల సంఖ్య 3,10,189గా తేలింది. వీటిల్లోంచి 50శాతం ఓట్లు ప్లస్ ఒక్క ఓటును జత చేయగా గెలుపుకోటా 1,55,095 ఓట్లుగా నిర్ధారణ జరిగింది. ఈ ఓట్లను ఏ అభ్యర్థి అయితే సాధిస్తారో వారే విజేత కానున్నారు. ప్రస్తుతం అభ్యర్థుల వారీగా ఓట్లను పరిశీలిస్తే తీన్మార్ మల్లన్న గెలుపు కోటాను చేరుకోవాలంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో 32,282 ఓట్లు సాధించాలి. రాకేశ్‌రెడ్డి విజేతగా నిలవాలంటే 50,853 ఓట్లు ద్వితీయ ప్రాధాన్యతలో పొందాలి. ప్రస్తుతం ఎవరూ కూడా గెలుపు కోటాకు చేరుకోలేకోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

### ఎలిమినేషన్ పద్ధతిలో విజేతగా..

అతి తక్కువ తొలి ప్రాధాన్యత ఓట్లు పొందిన అభ్యర్థి నుంచి పైకి ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలువగా ఇందులో 10 ఓట్లు మాత్రమే సాధించి చివరలో నిలిచిన యాతాకుల శేఖర్ నుంచి ఎలిమినేషన్ మొదలైంది. శేఖర్‌కు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచి వేస్తూ వస్తారు. ఇలా కిందనుంచి పైకి ఒక్కొక్క అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను వేస్తూ వస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడ కౌంటింగ్ నిలిపివేస్తారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే చివరి వరకు తీన్మార్ మల్లన్నతోపాటు రాకేశ్‌రెడ్డి పోటీలో నిలువనున్నారు. అప్పటికీ కోటా తేలక పోతే రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కూడా మొదటి అభ్యర్థికి పంచి వేస్తూ విజేతను ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ అంతా ముగిసి విజేత తేలాలంటే శుక్రవారం మధ్యాహ్నం వరకు సమయం తీసుకోవచ్చని అంచనా.

### గెలుపుపై ధీమాలో కాంగ్రెస్, బీఆర్ఎస్

ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గెలుపుపై అటు తీన్మార్ మల్లన్న, ఇటు రాకేశ్‌రెడ్డి ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి తనకే ఎక్కువ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు పోలవుతాయని భావిస్తున్నారు. అటు స్వతంత్ర అభ్యర్థి అశోక్‌తో పాటు బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిలకు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లే విజేతను తేల్చడంలో కీలకంగా మారనున్నాయి. వీరికి పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు ఎటువైపు ఉంటే వారే విజేతగా నిలువనున్నారు.

### కౌంటింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ ఆందోళన

కౌంటింగ్ కేంద్రంలో ఆర్‌ఓతోపాటు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం మీడియా ముందుకు వచ్చారు. ఓట్ల లెక్కింపులో తమ అభ్యంతరాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే ఫలితాలు ప్రకటించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పలు టేబుళ్లపై ఓట్ల లెక్కింపుతోపాటు మూడో రౌండ్‌లో తమకు సంబంధం లేకుండానే ఫలితాన్ని ప్రకటించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా కౌంటింగ్ కొనసాగాలే చూడాలని డిమాండ్ చేశారు. కౌంటింగ్‌లో తమ అభ్యంతరాలను వ్యక్తపరుస్తూ ఎన్నికల కమిషన్‌తోపాటు అబ్జర్వర్ రాహుల్ బొజ్జకు, రిటర్నింగ్ అధికారి హరిచందనకు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి లేఖను అందజేశారు.

---

# ఐసెట్‌కు 90.47 శాతం హాజరు

- 8న ప్రాథమిక కీ విడుదల
- ఐసెట్ కన్వీనర్ నర్సింహాచారి

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : టీజీ ఐసెట్ ప్రశాంతంగా జరిగినట్లు కన్వీనర్ నరసింహాచారి తెలిపారు. గురువారం ఉదయం జరిగిన మూడో సెషన్‌లో 28,256 మంది విద్యార్థులకు 25,662 మంది హాజరయ్యారని, మొత్తం 5, 6 తేదీల్లో మూడు సెషన్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 116 రీజియన్ సెంటర్లలో 86,156 మంది విద్యార్థులకు 77,942 మంది(90.47 శాతం) హాజరైనట్లు పేర్కొన్నారు. వరంగల్, నర్సంపేటలో గురువారం 8 పరీక్షా కేంద్రాల్లో జరిగిన మూడో సెషన్‌లో 1,545 మంది విద్యార్థులకు 1,456 మంది హాజరైనట్లు తెలిపారు. మొత్తం మూడు సెషన్లలో మొత్తం 4,659 మందికి 4364 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ప్రాథమిక కీ జూన్ 8వ తేదీన విడుదల చేయనున్నట్లు, విద్యార్థులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 8, 9 తేదీల్లో https://icet.tsche.ac.in లో నమోదు చేయవచ్చని కన్వీనర్ నరసింహాచారి తెలిపారు.

---

*ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో కొలువులకు మస్తు డిమాండ్ ఉంది. 32 పోస్టుల కోసం 2వేలకు పైగా దరఖాస్తులు రావడంతో పైరవీలూ అదే స్థాయిలో జరుగుతున్నట్లు తెలుస్తోంది. డీ-సెక్షన్ హాల్ అటెండెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్, థియేటర్ అసిస్టెంట్, ల్యాబ్ అటెండెంట్, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలను ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు కలెక్టర్ నేతృత్వంలో అధికారులతో కమిటీ వేసినప్పటికీ అధికార పార్టీ నాయకులు, దళారులతో పైరవీతో జాబ్ దక్కించుకునేందుకు ఉద్యోగార్థులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా ఒక్కో పోస్టుకు వందల సంఖ్యలో పోటీ ఉండడం, రూ. లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఖాళీలను భర్తీ చేసేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.*

**- ములుగు, జూన్ 6 (నమస్తే తెలంగాణ)**





ములుగు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల భవనం

# కొలువులు.. మస్తు పైరవీలు!

## ములుగు మెడికల్ కాలేజీ ఉద్యోగాలకు ఫుల్ డిమాండ్

**32 పోస్టులకు 2,191 దరఖాస్తులు**

- ఒక్కో జాబ్‌కు రూ.లక్షల్లోనే
- అధికార పార్టీ నాయకులు, దళారులతో బేరసారాలు
- పారదర్శకంగా నియామకాలు చేపట్టాలంటున్న నిరుద్యోగులు





ములుగు జిల్లాలో మెడికల్ కళాశాల బోర్డు

ములుగు జిల్లాలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీ వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానున్నది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా మెడికల్ కాలేజీకి అవసరమయ్యే సిబ్బంది నియామకాలతో పాటు పరికరాలను కొనుగోలు చేసే పనులను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 32 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కలెక్టర్ నేతృత్వంలో గత నెల 15న నోటిఫికేషన్ విడుదల చేసి 17 నుంచి 22వ తేదీ వరకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ఆరు విభాగాల్లో 32 ఉద్యోగాలకు 2,191 మంది దరఖాస్తు చేసుకున్నారు. మెడికల్ కాలేజీలో పనిచేసేందుకు నాలుగు డీ-సెక్షన్ హాల్ అటెండెంట్ పోస్టులకు 46 మంది, పది డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు 626 మంది, 8 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు 1,219 మంది, నాలుగు థియేటర్ అసిస్టెంట్ పోస్టులకు 57మంది, నాలుగు ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు 131మంది, రెండు రికార్డు అసిస్టెంట్ పోస్టులకు 112మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

**లక్షలు పలుకుతున్న ఒక్కో పోస్టు**

మెడికల్ కాలేజీ ఉద్యోగాల భర్తీలో 32 పోస్టులకు పెద్ద ఎత్తున నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవడంతో ఒక్కో పోస్టు మార్కెట్‌లో లక్షల రూపాయలు పలుకుతున్నది. కలెక్టర్ నేతృత్వంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఇతర అధికారులతో ఉద్యోగాల భర్తీ కోసం కమిటీ వేశారు. కమిటీ ద్వారా అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ దళారుల ప్రమేయం, అధికార పార్టీ నాయకుల పైరవీలతో ఉద్యోగాలను పొందేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. కొందరు తమకు తెలిసిన నాయకులను సంప్రదించి డబ్బులను పెట్టేందుకు ముందుకురావడంతో దీన్ని ఆసరా చేసుకున్న సంబంధిత నాయకులు లక్షల్లో డబ్బులను డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ఒక్కో పోస్టుకు వందల సంఖ్యలో పోటీ ఉండడంతో కొందరు అభ్యర్థులు నాయకులు డిమాండ్ చేసిన డబ్బులను రెడీ చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. చివరకు వడ్డీ వ్యాపారులు, గిరిగిరి ఇచ్చే వారి వద్దకు వెళ్లి బతిమిలాడుతున్నట్లు సమాచారం. ఉన్నత విద్య చదివిన వారు సైతం తమ టాలెంట్, మెరిట్‌ను నమ్ముకోకుండా ముడుపులిస్తేనే జాబ్ వస్తుందనే భ్రమలో ఉండడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఏదేమైనా పోస్టుల భర్తీలో ఉన్నతాధికారులు స్పందించి నాయకులు, మధ్యదళారుల పైరవీలు లేకుండా నియామకాలను పారదర్శకంగా చేపట్టాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

---



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు





# జేఎన్ఎస్‌లో హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు

- పాల్గొన్న 1200 మంది క్రీడాకారులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వరల్డ్ చాంపియన్ దీప్తి, ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ సాయిసంగీత, బ్రాంజ్ మెడలిస్ట్ నందిని

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వరంగల్, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. అండర్-8, 10, 12, బాయ్స్ అండ్ గర్ల్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, అండర్-14, 16, 18, 20 బాయ్స్ అండ్ గర్ల్స్ 100, 400 మీటర్స్ పోటీలు నిర్వహించగా, సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటిరోజు 100, 400 మీటర్ల రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, షార్ట్ పుట్ పోటీలు నిర్వహించారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన వరల్డ్ చాంపియన్ దీప్తి, ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ సాయిసంగీత, ఏషియన్ గేమ్స్ బ్రాంజ్ మెడలిస్ట్ అగస్త్యా నందిని క్రీడాకారులను ఉత్తేజపరిచారు. క్రీడాకారులతో పాటు తల్లిదండ్రులు వారితో ఫొటోలు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ క్రీడా పోటీల్లో బంగారు పతకమే లక్ష్యంగా క్రీడాకారులు పరుగులు తీశారు. కార్యక్రమంలో సెక్రటరీ సారంగపాణి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు ఐలి చంద్రమౌళిగౌడ్, ములుగు జిల్లా సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్ శ్రీమన్ పాల్గొన్నారు.

### ఇల్లు, ఉద్యోగం ఇవ్వాలి..



తెలంగాణలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పేదింటికి చెందిన నాకు రాష్ట్ర సర్కారు ఇంటితో పాటు ఉద్యోగం ఇవ్వాలి. కోచ్ నాగపురి రమేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం పేరు ప్రపంచానికి చాటి చెప్పాను. అనేక పతకాలు సాధించి పేరుప్రఖ్యాతులు తీసుకువచ్చాను. ఇటీవల జపాన్‌లో జరిగిన 400 మీటర్స్ టీ20లో వరల్డ్ చాంపియన్‌తో పాటు వరల్డ్ రికార్డు సాధించాను. జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్ క్రీడాకారులకు ఉపయోగకరంగా మారింది.

**- దీప్తి జీవన్‌జీ, వరల్డ్ చాంపియన్**

### ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించా..



దుబాయ్‌లో జరిగిన 4X4 రిలేలో ఏషియన్ గోల్డ్ మెడల్ సాధించాను. చాలా సంతోషంగా ఉంది. అంతర్జాతీయ క్రీడల్లో రాణించి బంగారు పతకాలు సాధిస్తా. అందుకోసం చాలా శ్రమిస్తున్నాను. కోచ్ ప్రోత్సాహంతో మెళకువలు నేర్చుకుని రాష్ట్రానికి ఇంకా పతకాలు సాధిస్తా. యువ క్రీడాకారులను ప్రోత్సహించాలి.

**- సాయిసంగీత, గోల్డ్ మెడలిస్ట్**

### ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలి..



చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాను. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడమే నా లక్ష్యం. క్రీడారులను ఆర్థికంగా ఆదుకోవాలి. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తే మరింత ప్రతిభ కనబర్చి పతకాలు సాధిస్తారు.

**- నందిని అగస్త్యా, ఏషియన్ గేమ్స్ బ్రాంజ్ మెడలిస్ట్**

---

# ఎన్నికల్లో గెలుపోటములు సహజం

- గెలుపొందిన కడియం కావ్యకు శుభాకాంక్షలు
- ప్రజల తీర్పును గౌరవిస్తాం
- బీజేపీకి దేశవాప్తంగా వ్యతిరేక పవనాలు
- బీఆర్ఎస్‌కు ఓటు వేసిన వారికి కృతజ్ఞతలు
- విలేకరుల సమావేశంలో జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్ కుమార్

హనుమకొండ, జూన్ 6 : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. వరంగల్ ఎంపీగా గెలుపొందిన కడియం కావ్యకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డితో కలిసి సుధీర్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూనే ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు కాని ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ఆగస్టు 15 లోగా రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేస్తూ ఓట్లు దండుకుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 64 మంది ఎమ్మెల్యేలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లకే పరిమితమైందంటే ఆరు నెలల్లోనే ఎంత వ్యతిరేకత వచ్చిందో అర్థమవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాకాలో, ఇంతకు ముందు ఎంపీగా గెలిచిన మల్కాజిగిరిలో సైతం బీజేపీ అభ్యర్థులు గెలిచారంటే సీఎం పాలన ఏ విధంగా ఉందో ఆలోచించాలని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ఇంకా ప్రజలను మభ్యపెడుతున్న సీఎంకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. బీజేపీపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వచ్చిందని, అందుకే లోక్‌సభ స్థానాలు భారీగా తగ్గాయన్నారు. ఎన్‌డీఏ కూటమిలోని పార్టీలతో కలిసి మరోసారి నరేంద్ర మోదీ ప్రధాని కాబోతున్నారే తప్ప ఎన్నికలకు ముందు 400 సీట్లు గెలుస్తామన్న బీజేపీ గతంలో గెలిచిన సీట్లు కూడా గెలవలేదని ఎద్దేవా చేశారు. వరంగల్ లోక్ సభ స్థానంలో సుమారు 2.30 లక్షల పైచిలుకు ఓట్లు బీఆర్ఎస్ పార్టీకి రావడానికి కృషి చేసిన పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు ఉడతల సారంగపాణి, జోరిక రమేశ్, నార్లగిరి రమేశ్, నయీమొద్దీన్, చింతల యాదగిరి, బండి రజినీ కుమార్, పోలపల్లి రామ్మూర్తి, సల్వాజీ రవీందర్ రావు, రమేశ్, కుసుమ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

---

# నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

- రైలులోని ఐదు బోగీల్లో అర్ధరాత్రి దొంగతనం
- జనగామ జిల్లా నష్కల్ - పెండ్యాల్ రైల్వే స్టేషన్ల మధ్య ఘటన



రైలు దోపిడీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కాజీపేట/చిల్పూరు, జూన్ 6 : నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధ వారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు దోపిడీకి పాల్పడ్డారు. జనగామ జిల్లా నష్కల్-పెండ్యాల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలును ఆపి ఐదు బోగీల్లోని ప్రయాణికులకు చెందిన దాదాపు 24 తులాల బంగారం, బ్యాగులు, సెల్‌ఫోన్లను అపహరించుకుపోయారు. రైల్వే పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి నాగర్‌సోల్ రైలు బుధవారం రాత్రి 11.50 గంటలకు బయలుదేరింది. నష్కల్-పెండ్యాల్ రైల్వేస్టేషన్ల మధ్య సాంకేతిక పనులు జరుగుతున్న నేపథ్యంలో రైలు 15-20 కిలోమీటర్ల స్పీడ్‌గా మాత్రమే నడుస్తోంది. ఈ క్రమంలో దీంతో దొంగలు గురువారం తెల్లవారుజామున 1.10 గంటలకు ఎయిర్ వాల్వ్ విప్పడంతో రైలు నిలిచిపోయింది. దీంతో కొందరు ఎస్ 2, ఎస్4, ఎస్ 5, ఎస్ 6, ఎస్ 11 బోగీల్లో ప్రవేశించి ప్రయాణికుల బ్యాగులు, సెల్‌ఫోన్లు, మరికొందరు బోగీ కిటికీల వద్ద ఒకరిపై ఒకరు ఎక్కి నిద్రలో ఉన్న వారి మెడల్లోని బంగారం వస్తువులను కత్తిరించి దొంగతనానికి పాల్పడ్డారు. వెంటనే మేల్కొన్న ప్రయాణికులు అరవడంతో కొంత మంది బంగారం వస్తువులను వదలిపెట్టి వెళ్లారు. 17 నిమిషాల తర్వాత రైలు కాజీపేట రైల్వే జంక్షన్‌కు చేరుకోగానే ప్రయాణికులు పోలీసుల దృష్టికి విషయాన్ని తీసువెళ్లారు. ఘటనా స్థలాన్ని గురువారం రైల్వే డీఎస్పీ కృపాకర్, జీఆర్పీ సీఐ సురేశ్, ఆర్పీఎఫ్ ఏఎస్‌సీ సుభాష్, సీఐ సంజీవరావు, ఏసీపీ భీష్మ వర్మ సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహినుద్దీన్ చెప్పారు. 12 గ్రాముల బంగారం చైన్‌ను అపహరించుకుపోయారని విజయవాడకు చెందిన అన్నెపు సాయిరమేశ్-కవిత ఫిర్యాదు చేశారని, మిగతా బాధితులు ఎవరైనా ఉంటే వారి ప్రాంతంలోని జీఆర్పీలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాజీపేటకు బదిలీ చేస్తారని వివరించారు.